క్లుప్తంగా

పశువుల పెంపకంలో జాగ్రత్తలు అవసరం



పోస్టర్లు విడుదల చేస్తున్న ఏడీ డాక్టర్ రత్నాకర్

బుక్కరాయసముద్రం: రైతులు పశువుల పెంపకంలో జాగ్రత్తలు పాటించాల్సిన అవసరముందని పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ రత్నాకర్ పేర్కొన్నారు. దయ్యాలకుంటపల్లిలో పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రత్నాకుమార్ మాట్లాడుతూ పశువుల్లో నట్ట నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. శిబిరంలో 64 లేగ దూడలకు నట్టల నివారణ మందులు, 3,420 గొర్రెలకు డీవార్మింగ్ మందులు వేశామన్నారు. అనంతరం పశువుల పెంపకంపై జాగ్రత్తలకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. సర్పంచ్ రమేష్, ఇన్‌చార్జ్ డాక్టర్ దిలీప్, ప్రవీణ్, రజాక్, సాయి, గీత పాల్గొన్నారు.

ఘనంగా మన్యుసూక్త హోమం



హోమం నిర్వహిస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: స్వామివారి భక్తులు సుఖ సంతోషాలు, ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకుంటూ మంగళవారం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో మన్యుసూక్త హోమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా అర్చకులు ఆలయ యాగశాలలో స్వామివారి ఉత్సవ మూర్తిని కొలువుదీర్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య హోమాన్ని నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

కడుపునొప్పి తాళలేక యువతి ఆత్మహత్య



రోషిణి(ఫైల్)

గుంతకల్లు రూరల్: కడుపు నొప్పి తాళలేక ఓ యువతి ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. పట్టణంలోని మిల్లు కాలనీకి చెందిన షేక్షావలి, నూర్జహాన్ దంపతులకు ఇద్దరు కుమారులు, కూతురు రోషిణి(19) ఉన్నారు. రోషిణి ఎస్కేపీ డిగ్రీ కళాశాలలో ఫస్టియర్ చదువుతోంది. ఆమెకు కడుపునొప్పి రావడంతో పలు ఆస్పత్రుల్లో చికిత్స చేయించినా ఫలితం లేకపోయింది. ఈక్రమంలో కాలేజీని కూడా మాన్పించి ఇంటి వద్ద ఉంచుకున్నారు. కడుపునొప్పి ఎక్కువ కావడంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంటి పైకప్పునకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



గుత్తి కోట క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

గుత్తి: గుత్తి కోట నూతన సంవత్సరం క్యాలెండర్ అద్భుతంగా వైఎస్సార్‌టీఏ జిల్లా నాయకులు శ్రీధర్ గౌడ్, ఎంఎస్ హైస్కూల్ హెచ్‌ఎం కిరణ్, వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శివశంకర్ ప్రశంసించారు. పట్టణంలోని ఎంఎస్ హైస్కూల్లో మంగళవారం గుత్తి కోట సంరక్షణ సమితి వ్యవస్థాపకుడు విజయభాస్కర్ ఆధ్వర్యంలో గుత్తి కోట నూతన సంవత్సరం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గుత్తి కోట క్యాలెండర్‌ను చూస్తుంటే గుత్తి కోటను చూస్తున్న అనుభూతి కలుగుతోందన్నారు.

మట్కా, పేకాటపై సమాచారమివ్వండి

యల్లనూరు: మండలంలో ఎక్కడైనా మట్కా, పేకాట ఆడుతుంటే సమాచారం ఇవ్వాలని పుట్లూరు సీఐ సత్యబాబు ప్రజలను కోరారు. మంగళవారం సీఐ విలేకరులతో మాట్లాడారు. మట్కా, పేకాట వంటి అసాంఘిక కార్యకలాపాలతో జీవితాలు నాశనం చేసుకోవద్దన్నారు. సమాచారాన్ని 9440796862 నెంబరుకి ఇవ్వాలన్నారు. సమాచారం ఇచ్చిన పేర్లను గోప్యంగా ఉంచుతామన్నారు.

ప్రత్యేక ఆధార్ కేంద్రం తనిఖీ



ఆధార్ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న డీఎల్‌డీఓ విజయలక్ష్మి

గుత్తి: పట్టణంలోని ఓల్డ్ మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆధార్ కేంద్రాన్ని డీఎల్‌డీఓ విజయలక్ష్మి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె ఆధార్ మార్పులు, చేర్పులు, అప్‌డేషన్ ఎలా జరుగుతోందో ఆరా తీశారు. అనంతరం ఆధార్ మార్పులు, చేర్పులు పూర్తయిన వారికి రశీదులు అందజేశారు. ఆధార్ అప్డేషన్, మార్పులు చేర్పులను వేగవంతంగా పూర్తి చేయించాలని మున్సిపల్ కమిషనర్ జబ్బార్ మియాను ఆదేశించారు.

స్వచ్ఛభారత్ లక్ష్యానికి తూట్లు



ఎస్‌జేపీ హైస్కూల్ వద్ద చెత్తకుండీ నిండిపోవడంతో రోడ్డుపై చెత్తాచెదారం

- అధ్వానంగా పారిశుధ్య నిర్వహణ
- మూడురోజులకోసారి ఇంటింటా చెత్తసేకరణ
- జనం సమస్యలు పట్టించుకోని మున్సిపల్ యంత్రాంగం

గుంతకల్లుటౌన్: స్వచ్ఛభారత్ లక్ష్యానికి మున్సిపల్ అధికారులే తూట్లు పొడుస్తున్నారు. పట్టణంలో పారిశుధ్యం పడకేయడంతో పలు కాలనీలు కంపుకొడుతున్నాయి. ఇంటింటా చెత్త సేకరణ క్రమంగా జరగట్లేదు. డ్రైనేజీలు పూడికతో నిండిపోయి మురుగు రోడ్లపై పారుతోంది. పారిశుధ్యంపై కౌన్సిలర్లే ప్రతి కౌన్సిల్ సమావేశంలో గగ్గోలు పెడుతున్నా అధికారులు మాత్రం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. గతంలో ఘన వ్యర్థ పదార్థాల నిర్వహణ, పారిశుధ్య నిర్వహణలో ఉమ్మడి ఏపీకే ఆదర్శంగా నిలిచిన గుంతకల్లు మున్సిపాలిటీ నేడు అధ్వాన స్థితికి చేరింది. సుమారు 1.50 లక్షల జనాభా కలిగిన పట్టణంలో 37 వార్డులున్నాయి. రోజూ పట్టణంలో 67 టన్నుల చెత్త (తడి చెత్త 43 టన్నులు, 24 టన్నుల పొడిచెత్త) ఉత్పత్తి అవుతోంది. పారిశుధ్య నిర్వహణకు 90 మంది రెగ్యులర్, 125 ఔట్‌సోర్సింగ్ కార్మికులు పనిచేస్తున్నారు.



ఎస్‌జేపీ హైస్కూల్ ట్యాంక్ ఆవరణలో మూలనపెట్టేసిన చెత్తసేకరణ ఆటోలు

పారిశుధ్యాన్ని మెరుగుపరుస్తాం



ఇంటింటా చెత్తసేకరణ సక్రమంగా జరగట్లేదన్నది వాస్తవమే. గతంలో 26 క్లాప్ ఆటోల ద్వారా ఇంటింటా చెత్తసేకరణ జరిగేది. ఏజెన్సీ నిర్వాహకుడు ఆటోడ్రైవర్లకు వేతనాలివ్వని కారణంగానే ఆటోలను వినియోగించట్లేదు. ట్రాక్టర్లు వెళ్లలేని గల్లీల్లో మూడు లేదా నాలుగు రోజులకోసారి చిన్న ఆటోలు, పుష్కార్ట్‌లను పంపి చెత్తసేకరణ చేయిస్తున్నాం. పారిశుధ్యాన్ని మెరుగుపరుస్తాం.

– హరినాథ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్, గుంతకల్లు

కార్మికుల సంఖ్య పెంచాలి



పెరిగిన పట్టణ విస్తీర్ణం, జనాభా కారణంగా ఒక్కో శానిటేషన్ డివిజన్‌కు 20 మంది కార్మికులను అదనంగా తీసుకోవాలి. ప్రస్తుతం పనిచేస్తున్న కార్మికుల్లో కొందరు చెత్త ట్రాక్టర్ డ్రైవర్లుగా, లోడర్లుగానూ మరికొంత మంది ఆఫీసులో పని చేస్తుండటంతో సిబ్బంది కొరత ఏర్పడింది. పైగా పదవీవిరమణ పొందిన వారి స్థానంలో కొత్తవారిని నియమించలేదు. కార్మికులపై తీవ్ర పని ఒత్తిడి ఉంది.

– జగదీష్, సీఐటీయూ పట్టణాధ్యక్షుడు, గుంతకల్లు

మూలనపడ్డ క్లాప్ ఆటోలు..

ఇంటింటా చెత్త సేకరణకై గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం క్లీన్ ఆంధ్రప్రదేశ్(క్లాప్) కార్యక్రమంలో భాగంగా రోజూ ఇంటింటా చెత్త సేకరణకై మున్సిపాల్టీకి 26 ఆటోలను మంజూరు చేసింది. గతంలో ఇంటింటా చెత్తసేకరణ బాగా జరిగేది. ఆటో డ్రైవర్లకు ఏజెన్సీ నిర్వాహకుడు వేతనాలివ్వకపోవడం, ఆటోల నిర్వహణ భారంగా భావించిన ప్రస్తుత అధికారులు ఆటోలన్నింటినీ మూలనపడేశారు. ప్రస్తుతం మున్సిపాల్టీలో 10 ట్రాక్టర్లున్నా వాటిలో ఒకట్రెండు మరమ్మతుకు నోచుకోలేదు. 3 ఆటోలు, 3 కాంపాక్టర్‌లు పని చేస్తున్నాయి. ప్రధాన రహదారులు, ప్రముఖులు నివసిస్తున్న ఏరియాల్లో మాత్రం చెత్తసేకరణ జరుగుతున్నా పలు వీధులకు నాలుగైదు రోజులైనా చెత్తసేకరణ జరగట్లేదని ప్రజలు వాపోతున్నారు. కమిషనర్, శానిటేషన్ అధికారులేమో పారిశుధ్య పనుల పరిశీలన పేరిట సామాజిక మాధ్యమాల్లో ఫోటోలను షేర్ చేస్తున్నారే తప్ప పారిశుద్ధ్యాన్ని మెరుగుపరిచిందేమీ లేదని ప్రజా సంఘాలు మండిపడుతున్నాయి.

భక్తిశ్రద్ధలతో ఊరి దేవర



దేవరలో పాల్గొన్న గుంతకల్లు మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ నైరుతిరెడ్డి తదితరులు

పామిడి: కట్టకిందపల్లిలో మంగళవారం గ్రామస్తుల ఆధ్వర్యంలో గ్రామదేవత పెద్దమ్మ దేవత దేవర కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో చేపట్టారు. ఈసందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. జంతు బలులిచ్చి మొక్కులు తీర్చుకున్నారు. బంధుమిత్రులను ఆహ్వానించి విందు ఏర్పాటు చేశారు. వైఎస్సార్‌సీపీ గుంతకల్లు నియోజకవర్గ నేత, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ వై నైరుతిరెడ్డి హాజరయ్యారు. ఈసందర్భంగా ఆమె పార్టీ జిల్లా ఆర్గనైజేషనల్ కార్యదర్శి పెమ్మక చెన్నకేశవరెడ్డి తదితర మండల నాయకులతో కలిసి పార్టీ నాయకులు, కార్యకర్తల ఇంటికి వెళ్లి వారి బాగోగులను అడిగి తెలుసుకున్నారు.

గార్లదిన్నె: మండలంలోని మర్తాడు, కోటంక గ్రామాల్లో పెద్దమ్మ దేవర కార్యక్రమం గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయా గ్రామాల్లో పెద్దమమ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. మహిళలు బోనాలు తీసుకెళ్లి పెద్దమ్మ అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. కోటంకలో సోమవారం రాత్రి చౌడమ్మ జ్యోతులు ఏర్పాటు చేశారు. మంగళవారం తెల్లవారు జామున కోటంక, మర్తాడులో దున్నపోతులు అమ్మవారికి బలిదానం చేశారు. కోటంకలో శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి, అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, ప్రభుత్వ విప్ కాలువ శ్రీనివాసు లు పెద్దమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు.

ఇద్దరికి తీవ్రగాయాలు

గుత్తి: పట్టణంలోని తాడిపత్రి రోడ్డుపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. వివరాలు.. యాడికికి చెందిన మధు, రామాంజి గుత్తిలో పని ముగించుకుని బైక్‌పై స్వగ్రామానికి బయలుదేరారు. పట్టణ సమీపంలో ఆటో రోడ్డుకు అడ్డంగా రావడంతో దాన్ని తప్పించబోయి అదుపు తప్పి బైక్ బోల్తా పడింది. ప్రమాదంలో బైక్‌పై నుంచి పడి ఇద్దరికీ తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు వారిని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ప్రభుత్వం ఆదుకోవాలని వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న బాధిత రైతులు

గుత్తి రూరల్: బసినేపల్లిలో తాము సాగు చేసిన పంట ఉత్పత్తులు అగ్ని ప్రమాదంలో కాలి బూడిదయ్యాయని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతులు కోరారు. మంగళవారం గ్రామానికి చెందిన రైతులు నాగూరు ఖాదర్‌బాషా, మౌలాలి అనే రైతులు తహసీల్దార్ ఓబిలేసుకు వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా రైతు నాగూరు ఖాదర్‌బాషా మాట్లాడుతూ తాను కంది, కొర్ర పంటలు సాగు చేసి పంట తొలగించి పొలంలోనే ఉంచానన్నారు. అయితే గుర్తు తెలియని వ్యక్తులు సిగరెట్ తాగి పడేయడంతో మంటలు చెలరేగి పంట ఉత్పత్తి మొత్తం కాలిపోయి తనకు రూ.2 లక్షలు నష్టం వాటిల్లిందన్నారు. కంది సాగు చేసి పంట ఉత్పత్తి తొలగించి పొలంలోనే ఉంచానని అగ్ని ప్రమాదంలో పంట మొత్తం కాలిపోయి రూ.1.30 లక్షలు నష్టం వాటిల్లిందని రైతు మౌలాలి వాపోయారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని రైతులు తహసీల్దార్‌ను కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ పులికొండ, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రయాణికుల భద్రతకు ప్రత్యేక చర్యలు



రైల్వేస్టేషన్‌ను పరిశీలిస్తున్న ఆడిట్ బృందం

గుంతకల్లు: భవిష్యత్‌లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా ప్రయాణికుల భద్రతకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా ఇంటెలిజెన్స్ డీఎస్పీ రాంబాబు, ఆర్‌డీఓ ఎబీవీఎస్‌బీ శ్రీనివాస్, గుంతకల్లు డీఎస్పీ శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారం గుంతకల్లు రైల్వే జంక్షన్‌లో ఇంటలిజెన్స్, గుంతకల్లులోని పలు విభాగాల అధికారులతో రైల్వే సెక్యూరిటీ ఆడిట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆడిట్ సభ్యులు రైల్వేస్టేషన్‌లోని ప్లాట్‌ఫారాలతోపాటు పరిసర ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ రైల్వేస్టేషన్‌తోపాటు పరిసరాల్లో అనుకోకుండా ఏదైనా ప్రమాదాలు, ఉగ్రవాద దాడులుతోపాటు రైళ్లల్లో చోరీలు, మాదక ద్రవ్యాల సరఫరా, అసాంఘిక వ్యక్తుల కదిలికలు, నిరసన సమయాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించామన్నారు. చర్చించిన అంశాలపై ఉన్నతాధికారులకు నివేదిక పంపుతామన్నారు. తహసీల్దార్ రమాదేవి, మున్సిపల్ కమిషనర్ నయీమ్ అహమ్మద్, అనంతపురం ఏఆర్ డీఎస్పీ నీలకంఠేశ్వర్‌రెడ్డి, ఆర్‌పీఎఫ్ ఏఎస్‌సీ అనిల్‌కుమార్‌సింగ్, ఆర్‌అండ్‌బీ డీఈఈ సత్యనారాయణ, ఏడీఈఎన్ నందగోపాల్, టౌన్ సీఐలు మనోహర్, మస్తాన్, ఆర్‌పీఎఫ్ సీఐ వసంతరావు, జీఆర్‌పీ సీఐ అజయ్‌కుమార్, స్పెషల్ బ్రాంచ్ ఎస్ఐ వెంకటకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సమస్యాత్మక గ్రామాల్లో ఏఎస్పీ పర్యటన



వీరాపురంలో పర్యటిస్తున్న ఏఎస్పీ రోహిత్‌కుమార్

తాడిపత్రి రూరల్: మండలంలోని సమస్యాత్మక గ్రామాలైన వీరాపురం, బొందలదిన్నె, పుట్లూరు రోడ్డు, యల్లనూరు రోడ్డు, ఎగువపల్లి, దిగువపల్లి, తేరన్నపల్లిలో మంగళవారం సాయంత్రం ఏఎస్పీ రోహిత్‌కుమార్ చౌదరి పర్యటించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు అందరూ సహకరించాలన్నారు. గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారి సమాచారం అందించాలని కోరారు. ఆయన వెంట అప్‌గ్రేడ్ రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డి ఉన్నారు.

ఘనంగా పెద్దమ్మతల్లి గ్రామోత్సవం



జ్యోతుల మహోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

పెద్దవడుగూరు : కోనాపురంలో మంగళవారం పెద్దమ్మతల్లి గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేపట్టారు. సోమవారం రాత్రి నుంచి మంగళవారం తెల్లవారుజామున వరకూ జ్యోతుల మహోత్సవం నిర్వహించారు. అనంతరం భక్తులు అమ్మవారి వారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకొన్నారు. తాడిపత్రి ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి, గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం పెద్దమ్మతల్లి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగించారు.

గార్లదిన్నెలో పెద్దమ్మకు బోనాలు

గార్లదిన్నె: మండల కేంద్రంలో మంగళవారం గ్రామస్తుల ఆధ్వర్యంలో పెద్దమ్మ అమ్మవారికి బోనాలు సమర్పించారు. అమ్మవారిని ప్రత్యేక అలంకరణ చేసి పూజలు చేపట్టారు. మహిళలు బోనాలతో ఊరేగింపు వెళ్లి అమ్మవారికి సమర్పించారు.

తాగునీటి సమస్య పరిష్కరించండి

గార్లదిన్నె: గ్రామాల్లో తాగునీటి సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎంపీడీఓ యోగానందరెడ్డి పంచాయతీ సిబ్బందికి సూచించారు. మంగళవారం ఎంపీడీఓ యర్రగుంట్ల, ముకుందాపురం గ్రామ సచివాలయాలను తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది రోజూ బయోమెట్రిక్ తప్పనిసరిగా నమోదు చేసుకోవాలన్నారు. అనంతరం యర్రగుంట్ల డంపింగ్ యార్డును పరిశీలించారు. ఈఓఆర్డీ వెంకటలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

హంద్రీనీవా కాలువను విస్తరించాలి

గుంతకల్లు రూరల్: హంద్రీనీవా కాలువను విస్తరించాలని కాంగ్రెస్ కిసాన్ సెల్ రాష్ట్ర మాజీ ఈసీ మెంబర్ టీసీ నారాయణరెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. హంద్రీనీవా కాలువ విస్తరణకు రూ.6700 కోట్లతో అధికారులు ప్రతిపాదనలు పంపగా ప్రభుత్వం బడ్జెట్లో రూ.867 కోట్లు మాత్రమే కేటాయించిందని గుర్తు చేశారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం చాలా అన్యాయమని, ఇంత జరుగుతున్నా కర్నూలు, అనంతపురం జిల్లాల ఎమ్మెల్యేలు మిన్నకుండిపోవడం బాధాకరమని పేర్కొన్నారు. ప్రభుత్వం తెచ్చిన 404, 405 జీఓలను వెంటనే రద్దు చేసి హంద్రీనీవా కాలువ సామర్థ్యం పెంచాలని ఆయన డిమాండ్ చేశారు.

గంపలు దారికి అడ్డంగా పెట్టొద్దు



వ్యాపారులతో మాట్లాడుతున్న కమిషనర్ సబ్బి శివరామకృష్ణ

తాడిపత్రి అర్బన్: పట్టణంలోని దినసరి కూరగాయల మార్కెట్‌లో వ్యాపారులు కూరగాయల గంపలు దారికి అడ్డుపెట్టొద్దని, అలా చేస్తే గంపలు స్వాధీనం చేసుకుంటామని మున్సిపల్ కమిషనర్ సబ్బి శివరామకృష్ణ హెచ్చరించారు. మంగళవారం ఆయన స్థానిక దినసరి కూరగాయల మార్కెట్‌ను తనిఖీ చేశారు. మార్కెట్లో నడవడానికి స్థలం కూడా లేకపోవడంతో కమిషనర్ వ్యాపారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మార్కెట్లో వ్యాపారస్థులందరూ తమకు కేటాయించిన స్థలాల్లో మాత్రమే కూరగాయల గంపలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. దారికి అడ్డదిడ్డంగా గంపలను పెట్టి నడవడానికి వీలులేకుండా చేస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు.

ప్రజాప్రతినిధులంటే చులకనెందుకు?

- అధికారులపై జెడ్పీటీసీ భోగతి ప్రతాప్‌రెడ్డి మండిపాటు



అధికారులను ప్రశ్నిస్తున్న జెడ్పీటీసీ భోగతి ప్రతాప్‌రెడ్డి

యల్లనూరు: గ్రామాల్లో ప్రజాప్రతినిధులకు తెలియకుండానే పనులు చేస్తున్నారని, వారంటే ఎందుకంత చులకనని జెడ్పీటీసీ భోగతి ప్రతాప్‌రెడ్డి అధికారులపై మండిపడ్డారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈసందర్భంగా అధికారుల తీరుపై జెడ్పీటీసీ ఆగ్రహం వ్యక్తం చేశారు. అభివృద్ధి పనులు ఏం జరగాలన్నా పంచాయతీల్లో సర్పంచులకు తెలియాలని, ఇది పంచాయతీ రాజ్ చట్టంలో ఉన్న అంశమన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక మండలంలో అధికారులు సర్పంచులకు తెలియకుండానే పనులు చేపడుతున్నారన్నారు. కనీసం పంచాయతీ తీర్మానాలు లేకుండా పనులు ఎలా చేపడతారని నిలదీశారు. అంతకుముందు అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికను చదివి వినిపించారు. ఎంపీటీసీలు యల్లనూరు తిమోతి, కల్లూరు సిద్దమ్మ, బొప్పేపల్లి యల్లప్పనాయుడు , సర్పంచులు పెద్దనాగరాజు, కుళ్లాయప్ప నాయుడు తహసీల్దారు రాజా, ఎంపీడీఓ వాసుదేవరెడ్డి, ఈఓఆర్డీ మనోహర్‌బాబు, ఏపీఓ షబ్బీర్‌బాషా, ఆర్‌డబ్ల్యుయస్ జేఈ సుప్రజ, హౌసింగ్ ఏఈ సుప్రజ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజామణి, వైద్యాధికారి లోకేష్, పీఆర్ జేఈ నరేంద్ర, కార్యదర్శులు పాల్గొన్నారు.

హోరాహోరీగా రాతిదూలం లాగుడు పోటీలు



రాతిదూలం లాగుతున్న వృషభాలు

పామిడి: కొండూరు రోడ్డులోని అంకాలమ్మ, కుంటెమ్మ 17వ జాతర సందర్భంగా నిర్వహించిన రాతిదూలం లాగుడు పోటీలు హోరాహోరీగా సాగాయి. పాలపళ్ల విభాగంలో అనంతపురం, కర్నూలు, కడప, నాగర్‌కర్నూలుకు చెందిన15 జతల వృషభాలు పోటీల్లో పాల్గొన్నాయి. తెలంగాణ నాగర్‌కర్నూలు జిల్లా లింగాల మండలం రాయవరం గ్రామ రైతు ఎం అక్షరరెడ్డి ప్రథమ స్థానం, కర్నూలు జిల్లా పత్తికొండ మండలం పందికోన లవకుమార్ వృషభాలు ద్వితీయ, వైఎస్సార్ కడప జిల్లా జమ్మలమడుగు టౌన్ రైతు ఎం మహేశ్వర్‌రెడ్డి వృషభరాజులు తృతీయ, నంద్యాల జిల్లా డోన్ మండలం మల్లెల గ్రామ రైతు షేక్ మహిమున్నా, కర్నూలు జిల్లా వెల్దుర్తి మండలం కల్లగొల్లు గ్రామరైతు రమేష్‌నాయుడు వృషభాలు సంయుక్తంగా నాలుగో స్థానం, కడప రూరల్ మండలం పాలంపల్లి గ్రామరైతు రాయల్‌రెడ్డి ప్రసాద్, అనంతపురం జిల్లా పెద్దవడుగూరు మండలం కాశేపల్లి గ్రామరైతు బానాల సాత్విక్‌రెడ్డి సంయుక్త మృషభరాజులు ఐదో స్థానం, నంద్యాల జిల్లా మిడుతూరు రైతు సాయివర్ధన్ వృషభాలు ఆరోస్థానంలో నిలిచాయి. విజేతలకు వరుసగా రూ.30వేలు, రూ.20వేలు, రూ.15వేలు, రూ.10వేలు, రూ.5వేల చొప్పున నగదు బహుమతులు ఇవ్వనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. బుధవారం న్యూ కేటగిరి విభాగంలో పోటీలు సాగుతాయన్నారు. ఇదిలా ఉండగా జాతర సందర్భంగా అంకాలమ్మ, కుంటెమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఈసందర్భంగా ఆలయ ప్రాంగణంలో వెలసిన పలు దుకాణాలు కొనుగోలుదారులతో రద్దీగా మారాయి.


పశు వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోండి



కనంపల్లిలో పశు వైద్యశిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

గార్లదిన్నె: మండల వ్యాప్తంగా పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే ఉచిత పశు వైద్యశిబిరాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని గార్లదిన్నె పశు వైద్యాధికారి డాక్టర్ రమేష్ పేర్కొన్నారు. మంగళవారం కనంపల్లిలో పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ శిబిరంలో పశువులకు నట్టల నివారణ మందుల పంపిణీ, గర్భకోశ వ్యాధులకు చికిత్స, పశువ్యాధి నిర్ధారణ పరీక్షలు, వ్యాధి నిరోధక టీకాలు వేశామన్నారు. అనంతరం పశువిజ్ఞానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

తప్పిన ప్రమాదం



బోల్తా పడిన లారీ

గుత్తి రూరల్: మండలంలోని కొత్తపేట గ్రామ శివారులో 44వ నంబర్ జాతీయ రహదారిపై మంగళవారం కారును లారీ వెనుక నుంచి ఢీకొన్న ఘటనలో ప్రమాదం తప్పింది. పోలీసులు తెలిపిన వివరాలు.. అనంతపురం నుంచి కర్నూలు వైపు వెళ్తున్న లారీని కారు ఓవర్ టేక్ చేస్తోంది. అయితే ముందు వెళ్తున్న కారును లారీ డ్రైవర్ గమనించకుండా వెళ్లి ఢీకొన్నాడు. కారుకు లారీ తగిలిన అనంతరం అకస్మాత్తుగా బ్రేక్ వేయడంతో లారీ అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న పంట పొలాల్లో బోల్తా పడింది. లారీ ఢీకొట్టడంతో కారు వెనుక భాగం దెబ్బతింది. అయితే ఈ ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకున్నారు.